సాక్షి రంగారెడ్డి

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



హైడ్రా పంజా

నీటి వనరుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కట్టడికి ఏర్పాటైన హైడ్రా మరోసారి దూకుడు ప్రదర్శించింది.

8లో ▸



అటవీ సంరక్షణకు కృషి

అటవీ ప్రాంతాన్ని రక్షించుకోవాలని ఆ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

8లో ▸



సంక్షేమమే ధ్యేయం

దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.

8లో ▸

న్యూస్‌రీల్

నేడు ఆమనగల్లు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆమనగల్లు: వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలకవర్గం బుధవారం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా యాట గీత, వైస్ చైర్మన్‌గా గూడురి భాస్కర్‌రెడ్డి, పలువురిని డైరెక్టర్‌లుగా నియమిస్తూ గత నెల 22న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో అభినందన సభ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరుకానున్నారు. ఏర్పాట్లను మంగళవారం మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

ఆమనగల్లు ఠాణాలో అదనపు డీసీపీ తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అదనపు డీసీపీ రాంకుమార్

ఆమనగల్లు: పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను మంగళవారం శంషాబాద్ అదనపు డీసీపీ రాంకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, పరిసరాలను అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. పోలీసుస్టేషన్‌కు సమస్యలతో వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేష్

మంచాల: పండ్ల తోటల పెంపకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కాలనుగుణంగా పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త శ్రీకృష్ణ, అధికారులు ముత్యాలు, రామరావు, మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్, ఉద్యాన శాఖ అధికారి నవీన తదితరులు పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వర స్వామి ఆదాయం రూ.12.8 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

మంచాల: మండలంలోని ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి పదిహేను రోజులుగా భక్తులు నుంచి వచ్చిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అనంగల్ల యాదయ్య మాట్లాడుతూ.. జాతర సందర్భంగా ఆలయానికి రూ.12,8,851 ఆదాయం చేకూరినట్లు చెప్పారు. వాటిలో హుండీ రూపంలో రూ.15,269, చందా రూపంలో రూ.8,25,802 వచ్చాయన్నారు. ప్రసాదానికి సంబంధించి రూ.1.50 లక్షలు, పార్కింగ్‌కు సంబంధించి రూ.2.1లక్షలు వచ్చినట్లు తెలిపారు. వీటిని దేవాలయం పేరు మీద బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆలయ అభివృద్ధికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం



ఏడాదిలో నియోజకవర్గానికి చేసింది కొంతే..

- రానున్న నాలుగేళ్లలో చేయాల్సింది ఎంతో ఉంది
- విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం
- పెండింగ్ పనులకు వీలైనంత త్వరగా పరిష్కారం
- అవినీతికి తావులేకుండా ప్రజా పాలన
- 'సాక్షి'తో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

SAKSHI INTERVIEW సాక్షి

'ఎన్నో ఆశయాలతో రాజకీయాల్లోకి వచ్చాను.. ఏడాది కాలంలో చేసింది తక్కువే.. రానున్న నాలుగేళ్లలో చేయాల్సింది ఎంతో ఉంది. విద్య.. వైద్యం.. రైతు సంక్షేమం.. పట్టణ, పల్లెల ప్రగతి.. పెండింగ్ పనుల పరిష్కారం ప్రస్తుతం నాముందున్న లక్ష్యాలు' అంటున్నారు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన నేపథ్యంలో ఈ ఏడాది అనుభవాలు.. భవిష్యత్తు ఆలోచనలను 'సాక్షి'తో పంచుకున్నారు.



– షాద్‌నగర్

ప్రశ్న: ఏడాది పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు?

జవాబు: ఎస్‌డీఎఫ్ కింద రూ.పది కోట్లు, ఎస్‌ఆర్‌జీఎస్ కింద రూ.8.72 కోట్లు, మినీ స్టేడియానికి రూ.2.75 కోట్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు రూ.150 కోట్లు, పీఆర్ నిధులు రూ.20 కోట్లు, షాద్‌నగర్ మున్సిపాలిటీకి రూ.27 కోట్లు, కొత్తూరుకు రూ.3 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. అసంపూర్తిగా ఉన్న పాత జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేశాం. షాద్‌నగర్‌లో పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాల.. కొందుర్గులో స్టేడియం నిర్మాణానికి భూమి కేటాయించాం. త్వరలో రూ.50 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు, రూ.87 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు మంజూరు కానున్నాయి.

ప్రశ్న: వంద పడకల ఆస్పత్రి, మోడల్ మార్కెట్ అసంపూర్తిగా ఉన్నాయి. ఎప్పుడు పూర్తి చేస్తారు?

జవాబు: గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. సంబంధిత మంత్రులతో మాట్లాడి బిల్లులు మంజూరు చేయించాను. త్వరలో పనులు పూర్తవుతాయి.

ప్రశ్న: చటాన్‌పల్లి ఫ్లైఓవర్ వంతెన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారు?

జవాబు: ఒకేవైపు ఫ్లైఓవర్ ఉండడంతో మిగతా రోడ్లలో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా బైపాస్‌కు వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఫ్లైఓవర్ మాత్రం బుచ్చిగూడ వైపు ఉంది. అలా కాకుండా వై ఆకారంలో ఉండేలా నిర్మిస్తాం. ఇందుకు అదనంగా రూ.90 కోట్లు మంజూరు చేయించాను. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: రహదారుల పరిస్థితి చాలా చోట్ల దయనీయంగా ఉంది. పరిగి రోడ్డు ఎలికట్ట నుంచి లాల్‌పహాడ్ వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విస్తరణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు. గ్రామీణ ప్రాంత రోడ్ల పరిస్థితి ఏమిటి?

జవాబు: పరిగి రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా కొన్ని మంజూరయ్యాయి. త్వరలో మహర్దశ వస్తుంది.

ప్రశ్న: కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లోని పాఠశాలల్లో సమస్యలపై ఏం చెబుతారు?

జవాబు: విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించాను. సీఎం షాద్‌నగర్‌కు రూ.150 కోట్లతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మంజూరు చేశారు. పేద విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునేందుకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. దాతల సహకారంతో సుమారు రూ.పది కోట్లతో షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నాం.

ప్రశ్న: షాద్‌నగర్ ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మించి రెండేళ్లు అవుతోంది. లబ్ధిదారులకు ఎప్పుడు పంపిణీ చేస్తారు?

జవాబు: డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే సమస్యలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. త్వరలో అర్హులకు ఇళ్ల పంపిణీ చేస్తాం.

ప్రశ్న: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ అంశం ఏళ్లుగా నానుతోంది. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు?

జవాబు: రిజర్వాయర్ విషయంలో గత ప్రభుత్వం చెప్పినవన్నీ అబద్ధాలే. రిజర్వాయర్ నిర్మాణం ఎంత అవసరమో సీఎం రేవంత్‌రెడ్డికి సవివరంగా చెప్పాను. త్వరలో పరిష్కారం లభిస్తుంది.

ప్రశ్న: రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గానికి ఏం చేయాలనుకుంటున్నారు.. ఎలాంటి అభివృద్ధిని ఆశించొచ్చు?

జవాబు: విద్య, వైద్య రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాను. వంద పడకల ఆస్పత్రి పూర్తి చేయడం, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, పాఠశాలల్లో సదుపాయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం, పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, పంచాయతీలకు నిధులు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. అవినీతికి తావు లేకుండా.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం.



ఘటనా స్థలంలో రైతులు వదిలి వెళ్లిన కూరగాయలు

నిన్నటి వరకు రద్దీ.. నేడు బోసిపోయి

- నిర్మానుష్యంగా మారిన ఆలూరు బస్‌స్టేజీ
- కూరగాయలు విక్రయించేందుకు ముందుకు రాని రైతులు
- దారివెంట భారీగా పోలీస్ బందోబస్తు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు బస్‌స్టేజీ వద్ద కూరగాయలు విక్రయించే వారిపైకి దూసుకొచ్చిన లారీ ప్రమాద స్థలం మంగళవారం నిర్మానుష్యంగా మారింది. కూరగాయలు విక్రయించేందుకు ఎవరూ రాలేదు. ప్రమాదం జరిగినప్పుడు భయంతో అక్కడే కూరగాయలు వదిలివెళ్లిన వారు కూడా వాటిని తీసుకెళ్లేందుకు అక్కడికి రాలేదు. దాదాపు 20 నుంచి 30 మంది ఆలూరు, నాంచేరి గ్రామానికి చెందిన రైతులు ఇక్కడ కూరగాయలు విక్రయించే వారు. ఈ సంఘటన వారిని భయభ్రాంతులకు గురి చేసింది. ఈ రోడ్డుపై నిత్యం కార్లలో కూరగాయలకోసం వచ్చే వారు అక్కడ ఎవరూ లేకపోవడంతో ఏం జరిగిందని అక్కడున్న స్థానికులు, పోలీసులను అడిగి తెలుసుకోవడం కనిపించింది. చేవెళ్ల ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్‌స్టేజీ వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు.

కూరగాయలు అమ్మొద్దంటూ ఫ్లెక్సీ

సంఘటనా స్థలంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ కూరగాయలు విక్రయించొద్దంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న ఈ స్థలంలో ఎవరూ కూరగాయలు అమ్మొద్దని, అమ్మితే రూ.10 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. చేవెళ్ల రైతు బజారులో కానీ, మార్కెట్లో కానీ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



ఆలూరు బస్‌స్టేజీ వద్ద పోలీస్ బందోబస్తు



చేవెళ్లలో ధర్నాకు దిగిన అఖిలపక్షం నాయకులు, మోహరించిన పోలీసులు

ప్రాణాలు పోతున్నా పట్టదా?

- ఇంకెంత కాలం నిర్లక్ష్యం చేస్తారు
- వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టండి
- అఖిలపక్షం నాయకుల డిమాండ్
- హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై చేవెళ్లలో ధర్నా

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు కాలయాపన చేస్తుండడంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని అఖిలపక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చేవెళ్లలో మంగళవారం ధర్నాకు దిగారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, సీపీఐకి చెందిన కె.రామస్వామి సత్తిరెడ్డి, సీపీఎంకు చెందిన దేవేందర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన శైలజ, సమత, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నా కోర్టు కేసులు అంటూ జాప్యం చేస్తారా అంటూ నిలదీశారు. ఎన్‌జీటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే కేసు వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని, దీనిపై మంత్రులు కానీ అధికారులు కానీ వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ చంద్రకళ అక్కడికి చేరుకున్నారు. రోడ్డు పనులకు సంబంధించి టెండర్లు, భూసేకరణ, పరిహారం పంపిణీ పనులు దాదాపు పూర్తయ్యాయని, రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు అన్ని అనుమతులు తీసుకున్నట్లు చెప్పారు. గ్రీన్ ట్రిబ్యునల్‌లో తేజ అనే వ్యక్తి కేసు వేయడంతో ఆలస్యమైందన్నారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు కూడా అప్పీల్ చేశారని ఈనెల 16న కేసు వాయిదా ఉందని తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం అఖిలపక్ష నేతలు గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు వేసిన తేజపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది మోహరించారు.

ఆలూరు బస్‌స్టేజీ వద్ద ఆందోళన

లారీ ప్రమాదం చోటు చేసుకున్న ఆలూరు బస్‌స్టేజీ వద్ద గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ధర్నాకు దిగారు. చేవెళ్ల వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. వీరికి బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మద్దతు తెలిపారు. ఆర్డీఓ చంద్రకళ వారిని సైతం సముదాయించి పంపించారు.



ఆలూరు బస్‌స్టేజీ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తీరని విషాదం

- లారీ ప్రమాద మృతులకు అశ్రునయనాలతో అంత్యక్రియలు
- ఆలూరు, నాంచేరి గ్రామాల్లో అలుముకున్న విషాదఛాయలు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంతో ఆలూరు, నాంచేరి గ్రామాల్లోని విషాదం అలుముకుంది. ఆయా గ్రామాల్లో మంగళవారం అంత్యక్రియల సందర్భంగా కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అంతా వ్యవసాయం, కూలి పనులు చేసుకునే కుటుంబాలకు చెందినవారే. ఆలూరుకు చెందిన నక్కలపల్లి రాములు (48) వ్యవసాయం చేస్తూ.. కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య మాధవి కొడుకు, కూతురు ఉన్నారు. కూరగాయలు అమ్మి వస్తానని చెప్పి వెళ్లి.. దూరంగా వెళ్లావా.. మేమెలా బతకాలి అంటూ భార్య మాధవి రోదనలు కంటతడిపెట్టించాయి. అదే గ్రామానికి చెందిన మరో కుటుంబంలోని దామరగిద్ద జంగయ్య, యాదమ్మ వ్యవసాయం చేసుకుంటూ నలుగురు పిల్లలను చక్కగా చదివించారు. కూతురుకు టీచర్ ఉద్యోగం రాగా ముగ్గురు కొడుకులు బీఈడీ, డీఎడ్, ఐటీఐ చదివారు. ఉద్యోగాన్వేషణలో ఉన్న వారు తల్లిదండ్రులకు సాయంగా వ్యవసాయం, కూరగాయలు విక్రయించే పనులు చేస్తున్నారు. చిన్న కొడుకు కృష్ణ (19) మృతితో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కృష్ణ ఐటీఐ చదివి రైల్వే ఉద్యోగంకోసం ఇటీవలే పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురు చేస్తూ కుటుంబానికి ఆసరగా ఉంటున్నాడు. అన్న కూరగాయలు విక్రయించే చోటుకు టమాటా బాక్స్‌లు ఇచ్చేందుకు వచ్చి ఈ ప్రమాదంలో మృతి చెందాడు. అన్నకు సాయంగా వెళ్లి అనంతలోకాలకు వెళ్లావా అంటూ తల్లి యాదమ్మ, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



దామరగిద్ద కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి యాదమ్మ, బంధువులు



విలపిస్తున్న మృతుడు నక్కలపల్లి రాములు భార్య మాధవి


కలచివేసిన రోదనలు

నాంచేరి గ్రామానికి చెందిన శ్యామల సుజాత (42), భర్త వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబానికి అండగా తరచూ కూరగాయలు విక్రయిస్తూ భర్త, కొడుకును చూసుకునే శ్యామల సుజాత మరణం వారి కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. ప్రమాద సంఘటన నుంచి మంగళవారం అంత్యక్రియల వరకు 'అమ్మా.. నన్ను వదిలి వెళ్లావా' అంటూ కొడుకు రోదనలు అందరినీ కలిచివేశాయి. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బాధితులకు ఒక్కొక్కరికి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. మార్కెట్ చైర్మన్ పెంటయ్య గౌడ్ సైతం సాయం అందించారు.

పరువు, ఆస్తి కోసమే హత్య

- కానిస్టేబుల్ నాగమణి మర్డర్ నిందితుడికి రిమాండ్
- పరమేశ్‌కు సహకరించిన మరో వ్యక్తి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: కులాంతర వివాహం చేసుకోవడంతో పాటు ఆస్తి కోసం బెదిరిస్తోందనే కారణంతో సొంత అక్కను చంపిన నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కులాంతర వివాహం, ఆస్తి వ్యవహారంతోనే కానిస్టేబుల్ నాగమణిని ఆమె సొంత తమ్ముడు కొంగర పరమేశ్(26) హత్య చేశాడని పేర్కొన్నారు. నాగమణి కదలికలపై నిందితుడికి సమాచారం ఇచ్చిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. మృతురాలు నాగమణికి అక్క హైమావతి, తమ్ముడు పరమేశ్ ఉన్నారు. 2009లో అక్క వివాహం జరగ్గా ఆమె భర్తతో కలిసి తుర్కయంజాల్‌లో నివసిస్తోంది. పదేళ్ల క్రితమే తల్లిదండ్రులు చనిపోవడంతో నాగమణి, పరమేశ్ రాయపోల్‌లోని పెద్దనాన్న సంరక్షణలో పెరిగారు. 2014లో నాగమణికి పటేల్‌గూడ వాసితో వివాహం జరిగింది. ఈ సమయంలో పసుపుకుంకుమల కింద ఎకరా భూమి రాసిచ్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో నాగమణి అతన్ని వదిలేసి, రాయపోల్ వచ్చేసింది. హయత్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమైంది. ఈ క్రమంలో 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికై కుషాయిగూడ, హయత్‌నగర్ పీఎస్‌లలో పనిచేసింది. 2022లో మొదటి భర్తతో విడాకులు తీసుకుంది. రాయపోల్‌లో ఉన్నప్పుడే ఆ గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్‌తో ఉన్న పరిచయం ప్రేమగా మారింది. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినా ఆమె వినలేదు. దీంతో మొదటి పెళ్లి జరిగిన సమయంలో ఆమెకు ఇచ్చిన ఎకరా భూమిని తిరిగి ఇచ్చేసింది. గత నెల 10న యాదగిరిగుట్టలో శ్రీకాంత్‌ను కులాంతర వివాహం చేసుకుంది. ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్‌గా పనిచేసే శ్రీకాంత్‌తో కలిసి వనస్థలిపురం సహారా ఎస్టేట్స్‌లోని ఓ అద్దెంట్లో కాపురం పెట్టారు. ఈ క్రమంలో తన ఎకరం తనకు తిరిగివ్వాలని తమ్ముడిని డిమాండ్ చేసింది. కులాంతర వివాహం చేసుకొని తమ పరువు తీయడమేగాకుండా, భూమి ఇవ్వాలని పేచీ పెడుతోందని పరమేశ్ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం ఓ కత్తి (కమ్మ కత్తి)కొని కారులో దాచిపెట్టి అవకాశం కోసం ఎదురుచూడసాగాడు. ఆదివారం భర్తతో కలిసి వచ్చిందని తెలియడంతో హత్యకు సిద్ధమయ్యాడు. నాగమణి కదలికలను తెలిపేందుకు స్నేహితుడు అచ్చన శివను ఉపయోగించుకున్నాడు. సోమవారం ఉదయం స్కూటీపై విధులకు బయలుదేరిన విషయాన్ని శివ ఫోన్‌లో చేరవేశాడు. దీంతో పరమేశ్ కారులో ఆమెను వెంబడించాడు. మన్నెగూడ రోడ్డు జంక్షన్ వద్ద వెనకనుంచి ఢీకొట్టి, కిందపడగానే వెంటనే కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు మంగళవారం రాయపోల్ సమీపంలోని జనహర్ష వద్ద పరమేశ్‌ను పట్టుకున్నారు. అతని నుంచి కారుతోపాటు ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి సహకరించిన శివ కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు పరమేశ్‌తో సీఐ సత్యనారాయణ, పోలీసులు

అరటి కాయ గొంతులో ఇరుక్కుని వ్యక్తి మృతి


బాల్‌రాజ్ మృతదేహం

కొందుర్గు: అరటికా య గొంతులో ఇరుక్కుని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కొందుర్గు మండలం తంగెళ్ల పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్కల బాల్‌రాజ్(55) వ్యవసాయం, కూలీ పనులు చేస్తుంటాడు. మంగళవారం పొలంలో కాసిన అరటి కాయ ను తింటుండగా గొంతులో ఇరుక్కుని, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య నీలమ్మతోపాటు, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. బాల్‌రాజ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ శ్రీ పోలిశెట్టి జేమ్స్ తండ్రి లేట్ అర్లయ్య, వయస్సు: 71 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: కమ్మగూడ, H/o తుర్కయాంజాల్ గ్రామం, హయత్‌నగర్ మండలం, ఆధార్ నం.583936176574 వారు GPA హోల్డర్‌గా ఆర్.ఆర్.జిల్లా, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, రగన్నగూడ గ్రామపంచాయతీ, తుర్కయాంజాల్ గ్రామంలోని సర్వే నం.276/అ లోని ఎ.5-15 గుంటలు లేదా 2.175 హెక్టార్ల విస్తీర్ణం గల భూమిలోని 96 ప్లాట్లలో 93 ప్లాట్లను విక్రయించారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. అతను నం.84, 85 మరియు 86 కలిగిన 3 ప్లాట్లు విస్తీర్ణం 585 చ.గజాలు లేదా 489.11 చ.మీటర్లను ఎవరికీ విక్రయించలేదు. సరిహద్దులు: ఉత్తరం: 20' వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.81, 82 మరియు 83, తూర్పు: 25' వెడల్పు రోడ్డు, పశ్చిమం: పొరుగువారి భూమి. సదరు 3 ప్లాట్లను కొనుగోలు చేయరాదని లేదా ఏ రకమైన వ్యవహారం కుదుర్చుకోనరాదని ఇందుమూలంగా ప్రజలందరికీ సమాచారం ఇవ్వడమైనది. నా క్లయింట్ సదరు 3 ప్లాట్ల యొక్క సంపూర్ణ యజమాని మరియు స్వాధీనదారు మరియు ఎవరైనా ఇతర వ్యక్తి జరిపిన ఏవైనా వ్యవహారాలకు నా క్లయింట్ బాధ్యులుకారు.

సం/- సిహెచ్. సుధారాణి, అడ్వకేట్
ప్లాట్ నం.18/ఎఫ్‌1, బాదం ఎక్లేవ్, HUDA కాంప్లెక్స్, కొత్తపేట, సరూర్‌నగర్, హైదరాబాద్-500035.
ఫోన్: 9391370627 ch.sudharani66@gmail.com

అటవీ సంరక్షణకు సమష్టి కృషి

- వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు
- ఇబ్రహీంపట్నం రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

యాచారం: అటవీ ప్రాంతాన్ని రక్షించుకొని, భావితరాలకు అందివ్వాల్సిన అవసరం ఉందని ఆ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గునుగల్ అటవీ ప్రాంతంలో మంగళవారం 'అటవీ రక్షణ-వన్యప్రాణుల సంరక్షణ, అడవి-నిప్పు నియంత్రణ'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి మీద ప్రాణాలతో ఉండే ప్రతి ప్రాణికి అటవీ ప్రాంతం కీలకమన్నారు. అడవి సస్యశ్యామలంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే అడవిని కాపాడుకోవడానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గునుగల్ అటవీ ప్రాంతంలో అన్ని రకాల వన్యప్రాణులు జీవించే విధంగా వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వన్యప్రాణులను వేటాడితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవిలో అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోతుందన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని తెలిపారు. అనంతరం మొక్కల పెంపకం, సంరక్షణపై అటవీశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. సదస్సులో యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి స్వప్న, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనం వద్ద దివ్యాంగులకు బ్యాటరి ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, ఎంఆర్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే మానసిక పునరావాస కేంద్రానికి సొంత భవనం మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏడీఏ రాజరాత్నం, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఎం భగవంతు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్ నాయకులు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అమీర్, రమేష్, పర్వతాలు, మనోహర్‌గౌడ్, సుందరయ్య పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మంచాల: అతి వేగం ఓ యువకుడిని బలి తీసుకుంది. రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంచాల మండలంలోని లింగంపల్లి గేట్ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ మధు కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం కడీలబావి తండాకు చెందిన కారంటోత్ మహేశ్(23) వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. ఆయన సాయంత్రం ఇబ్రహీంపట్నం నుంచి మంచాల వైపు బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో లింగంపల్లి గేట్ వద్దకు రాగానే కోళ్ల ఫారానికి దాణా తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. అతివేగం కారణంగా తలకు బలమైన గాయం కావడంతో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


ఘటనాస్థలిలో విగతజీవిగా ఉన్న మహేశ్

అల్మాస్‌గూడలో హైడ్రా పంజా

- పార్కు స్థలంలో వెలిసిన నిర్మాణాల తొలగింపు
- హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు

బడంగ్‌పేట్: నీటి వనరుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కట్టడికి ఏర్పాటైన హైడ్రా మరోసారి దూకుడు ప్రదర్శించింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 4వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో హైడ్రా అధికారులు పంజా విసిరారు. కార్పొరేషన్ పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన ఓ కంటైనర్‌ను హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో మంగళవారం నేలమట్టం చేసింది. బాలాపూర్ మండలం అల్మాస్‌గూడలోని వెంకటేశ్వరకాలనీలో సర్వేనంబర్లు 89, 90లలో పట్టాదార్లు 1982లో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. అప్పట్లో వెంచర్‌లో మూల మలుపుల వద్ద క్రాస్ బిట్లను పార్కుగా చూయించారు. ప్రస్తుతం భూమికి రేట్లు పెరగడంతో సదరు వెంచర్‌దారులు ఖాళీ ప్రాంతాన్ని కబ్జా చేశారు. దీంతో కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని పార్కు స్థలాలు అంటూ బోర్డులు పాతి ఫెన్సింగ్ వేశారు. అయినప్పటికీ వెంచర్‌దారులు దౌర్జన్యంగా సూచిక బోర్డులు తీసేసి స్థలంలో కంటైనర్, ఇతర నిర్మాణాలు చేపట్టారు. కాలనీవాసుల ఫిర్యాదుతో పాటు మున్సిపల్ అధికారులు కలిసి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు సుమారు రూ.50 కోట్లు విలువచేసే 700 వందల గజాల స్థలం కార్పొరేషన్‌కు చెందింది అని నిర్ధారించారు. పార్కు స్థలంలో అక్రమంగా వెలిసిన కంటైనర్‌ను తొలగించారు. దీంతో కాలనీవాసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.


వెంకటేశ్వరకాలనీలో ఆక్రమణలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

రంగనాథ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొన్నేళ్లుగా పార్కు స్థలం కోసం మున్సిపల్ అధికారులతో కలిసి పోరాడుతున్నా వెంచర్ నిర్వాహకుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని కాలనీవాసులు ఆరోపించారు. మాగోడు విని హైడ్రా అధికారులు స్పందించి పార్కు జాగాను అక్రమార్కుల చెర నుంచి విడిపించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చిత్రపటానికి కాలనీవాసులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బి.జంగయ్య, సభ్యులు కె.బాబు, మధుసూదన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, రవి, సూర్య, దర్శన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాము, కిషన్‌యాదవ్, రమాచారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాలనీవాసులు

హక్కుల పరిరక్షణకు పోరాడుతాం

కొందుర్గు: బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బైరంపల్లిలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కూలీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరమ్మ, అశోక్‌రెడ్డి, జంగమ్మ, సువర్ణ, బందెమ్మ, లక్ష్మమ్మ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

నేడు పరువు హత్యపై రౌండ్ టేబుల్ సమావేశం

ఇబ్రహీంపట్నం: కానిస్టేబుల్ నాగమణి పరువు హత్యపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సామెల్ తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు హాజరయ్యే ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

మతచాందసుల అరాచకాలపై గళమెత్తాలి

గన్‌ఫౌండ్రీ: సమాజంలో మత చాందసవాదులు చేస్తున్న అరాచకాలపై కవులు గళమెత్తాలని శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న సూచించారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నెలపొడుపు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన 'అసిపె' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణుల వృత్తిపై పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పాశ్చాత్య ధోరణిలో నాయీబ్రాహ్మణుల చేతి వృత్తి సైతం కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బహుజన ఉద్యమంలో భాగంగా బీసీ కవులు, రచయితలు, కళాకారులు ఏకమై నిలవాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, చరిత్ర పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, కవి గుంటూరు లక్ష్మీనర్సయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌ను అధికారికంగా జరిపించిన ఘనత కేసీఆర్‌దే


కేక్ కట్ చేస్తున్న హరీశ్‌రావు

రాంగోపాల్‌పేట్: దేశంలో ఎక్కడాలేని విధంగా క్రిస్మస్ పండగను అధికారింగా నిర్వహించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ వెస్లీ చర్చిలో గాడ్ విజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. యేసు క్రీస్తు ప్రేమ, దయాగుణం, శాంతి, కరుణను అందరిలో పెంపొందించారని.. ఇవే మనిషిని ఉన్నత స్థానానికి తీసుకుని వెళతాయన్నారు. పదవి, సంపద ఉండటమనేది ఉన్నత స్థానం కాదని గుణగణాలతో ఉన్నతంగా జీవించే వారే ఉన్నతమైన స్థానంలో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్ కట్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ చొరవతో హైవే పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి

- ఆలూరు ఘటన బాధాకరం
- ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దు
- ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి


చేవెళ్ల: హైదరాబాద్-బీజాపూర్ నేషనల్ హైవే పనులను ప్రభుత్వం ప్రత్యేక అనుమతులతో ఇప్పటికే ప్రారంభించిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదం విషాదకరమైనదన్నారు. ఈ రోడ్డు పక్కనే కూరగాయలు అమ్ముకునే వారి కోసం అక్కడే ఏదైనా ప్రభుత్వ స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. త్వరలో వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణపై ప్రతిపక్షాలు పట్టించుకోవటం లేదు అనటం సరైనది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రీన్ ట్రిబ్యూనల్ కేసులను సైతం క్లీయర్ చేసి రోడ్డు పనులు ప్రారంభించేందుకు సిద్ధమైందన్నారు. ఇటీవల మరో వ్యక్తి ఎన్‌జీటీలో కేసు వేయటంతో దీనిపై కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ఐఎఫ్ఎస్ అధికారిని నియమించి ఎన్‌హెచ్ అధికారులతో కలిసి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారన్నారు. గత నెల 27నే పనులు చేసుకునేందుకు అనుమతి తీసుకోవటం జరిగిందన్నారు. ప్రతిపక్షాలు బాధ్యతగా మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ఏఎంసీ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బాటసింగారం ప్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి (30-35)కి ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బల్కంపేట సన్నిధిలో మంత్రి పొన్నం



అమీర్‌పేట: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రానున్న నాలుగేళ్లలో ప్రజలకు మరింత సంక్షేమం అందించేలా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- గుర్తింపు ఎన్నికల్లో ఎస్‌సీఆర్‌ఈఎస్‌ను గెలిపించండి
- రైల్వే కార్మిక సంఘం జాతీయ నేత మర్రి రాఘవయ్య పిలుపు



అడ్డగుట్ట: రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్(ఎస్‌సీఆర్‌ఈఎస్)ఎల్లప్పుడూ ముందు ఉంటుందని ఎన్ఎఫ్ఐఆర్, ఎస్సీఆర్‌ఈఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. ఈ నెల 4 నుండి 6వ తేదీ వరకు యూనియన్ల గుర్తింపు కోసం సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికలు 17 జోనల్ రైల్వేలు, 2 ప్రొడక్షన్ యూనిట్లలో నిర్వహిస్తారని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలో దాదాపు 78 వేల మంది రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. 1966 నుంచి ఎస్‌సీఆర్‌ఈఎస్ (ఎన్ఎఫ్ఐఆర్ అనుబంధం) ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ అంకితభావంతో సేవలందిస్తుందన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ పోరాటాల ఫలితంగానే డీఏ ఫార్ములా అమలు చేశారని, ఇప్పుడు ప్రతీ ఉద్యోగికి ధరల పెరుగుదల ఆధారంగా డీఏ లభిస్తోందన్నారు. 1957లో లిబరలైజ్డ్ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టిందని, అయితే కేంద్ర ప్రభుత్వం జనవరి 1వ తేదీన 2004లో కొత్త పెన్షన్ స్కీం అమలు చేసిందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణకై శ్రమిస్తున్నామని రాఘవయ్య వెల్లడించారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు డిమాండ్లపై తాము పోరాటం చేస్తున్నామని వివరించారు. రైల్వే ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టరైజేషన్‌కు వ్యతిరేకంగా తమ యూనియన్ నిరంతరం ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి పాటుపడుతున్న ఎంప్లాయీస్ సంఘ్‌కు యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇచ్చిన డబ్బులు అడిగినందుకు గొంతు కోసి చంపేశాడు

హయత్‌నగర్‌లో దారుణం


కాశీరావు (ఫైల్)

లింగోజిగూడ: అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇమ్మన్నందుకు వ్యక్తి గొంతు కోసి హత్య చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం దోనకొండకు చెందిన యక్కలి కాశీరావు (37), భార్య సుమలత, ఇద్దరు పిల్లలతో కలిసి హయత్‌నగర్ భాగ్యలత అరుణోదయ నగర్‌లో రెండున్నరేళ్లుగా ఉంటున్నాడు. కాశీరావు స్థానికంగా కార్ల క్రయ విక్రయాలు చేస్తుంటాడు. కాశీరావు కిరాయికి ఉంటున్న ఇంట్లోని మొదటి అంతస్తులోనే నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన బ్యాచ్‌లర్లు పెద్దగాని శేఖర్, పెద్దగాని సాయి, ఐతరాజు శంకర్‌లు అద్దెకి ఉంటున్నారు. వీరిలో సాయి, శంకర్ హయత్‌నగర్‌లోని బొమ్మలగుడి సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాశీరావు, పెద్దగాని శేఖర్ ఇద్దరూ కలిసి కార్ల వ్యాపారం ప్రారంభించారు. 2023లో రూ.1.5 లక్షలు ఒకసారి, రూ. 3.60 లక్షలు మరోసారి కాశీరావు వద్ద శేఖర్ అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు డబ్బులు ఇవ్వాలనిటూ శేఖర్ గదికి వెళ్లి కాశీరావు అడుగుతుండేవాడు. ఈ విషయమై వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సాయి, శంకర్ వ్యక్తిగత పనిపై గదిలోంచి బయటకు వెళ్లారు. 10 గంటల సమయంలో కాశీరావు.. పైఅంతస్తులో ఉన్న శేఖర్ గదికి వెళ్లాడు. 20 నిమిషాలు గడుస్తున్నా కాశీరావు కిందకు రాలేదు. 10.20 గంటల సమయంలో శేఖర్ రక్తపు మరకలతో కిందకు దిగి వచ్చాడు. అక్కడే దుస్తులు ఆరేస్తున్న కాశీరావు భార్య సుమలతతో.. 'నీ భర్తను చంపేశాను' అంటూ వెళ్లిపోయాడు. సుమలత వెంటనే పైఅంతస్తులోని గదికి వెళ్లి చూడగా.. మెడ భాగంలో బలమైన గాయాలతో కాశీరావు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. భర్తను పైకి లేపాలని సుమలత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అతడు అప్పటికే మృతి చెందినట్లు గ్రహించిన సుమలత స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించింది. అప్పు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతున్నాడనే కోపంతోనే గొడవ పడిన శేఖర్.. కాశీరావు గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు శేఖర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.